క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి



తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న హెచ్ఎం సూర్యనారాయణ

పాలకొండ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ కె.సోంబాబు అన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇళ్లకు శుక్రవారం వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంటి వద్ద విద్యార్థులు ఎలా చదువుతున్నదీ ఆరా తీశారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి..

వీరఘట్టం: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించడం వల్ల పెట్టుబడులు తగ్గుతాయని మండల వ్యవసాయశాఖాధికారి జె.సౌజన్య అన్నారు. మండలంలోని పనసనందివాడలో చెరకు పంటకు డ్రోన్‌ల ద్వారా రసాయన ఎరువును శుక్రవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాధారణ పద్ధతిలో ఎకరా పంటకు మందు పిచికారీ చేయాలంటే మూడు గంటల సమయం పడుతుందని, అదే డ్రోన్ ద్వారా అయితే అరగంట సరిపోతుందని చెప్పారు. ఆమె వెంట సీసీ ఆనందరావు, తదితరులున్నారు.

భూ ఆధార్‌కు నమోదు చేసుకోవాలి

పాలకొండ: రైతులు భూఆధార్‌కు రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై.వాహిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతూ తమ భూములకు సంబంధించి భూ ఆధార్ లేదా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవడానికి ఆర్ఎస్‌కేలను సంప్రదించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు వర్తించాలంటే భూ ఆధార్ తప్పనిసరన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధామైన ఫోన్ నంబర్‌తో రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

పెదమేరంగి కూడలిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం రేపు

జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమలసాయి హైస్కూల్ వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్‌వైవీ సాయికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ వారి సహకారంతో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేత్ర పరీక్షలకు వచ్చేవారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తీసుకు రావాలని సూచించారు.

సందడే సందడి..

భామిని: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులకు జూనియర్లు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు చట్టాలు

గరుగుబిల్లి: బాలికల రక్షణకు ప్రభుత్వం పలు చట్టాలు చేసిందని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని సెంట్రల్ అడ్మినిస్టేటర్ జి.శాంతికుమారి అన్నారు. మండలంలోని రావివలస కేజీబీవీలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వన్‌స్టాప్ కేంద్రం నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్ సేవలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహహింస, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం జరుగుతోందని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో ఫ్రై డే - డ్రై డే సందర్భంగా రక్షిత మంచినీటి పథకం, నేలబావులు, తాగునీటి బోర్ల వద్ద క్లోరినేషన్, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, తదితరులున్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..

- వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుంటున్న ఉపాధ్యాయులు
- ప్రత్యేక తరగతుల నిర్వహణ
- పరీక్షలకు హాజరుకానున్న 10,445 మంది విద్యార్థులు
- 67 కేంద్రాల్లో పబ్లిక్ పరీక్షలు



మల్లి పీవీటీజీ గురుకుల పాఠశాలలో వేకువజామున చదువుతున్న టెన్త్ విద్యార్థులు

సీతంపేట/పాలకొండరూరల్: పది పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను పదునుపెడుతున్నారు. వచ్చేనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ పాఠశాలల్లో కౌంట్‌డౌన్ నంబర్ చూపిస్తూ విద్యార్థులను పరీక్షలకు మానసికంగా సిద్ధం చేస్తున్నారు. బోధనతో పాటు ప్రేరణ తరగతులు, యోగ, ధ్యానం వంటివి నిర్వహిస్తున్నారు. మొత్తం 212 పాఠశాలలకు గాను 67 పరీక్ష కేంద్రాల్లో 10,445 మంది టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు.

విద్యార్థుల దత్తత..

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గిరిజన గురుకులాల్లో అయితే వేకువజామున 5 గంటల నుంచి 6 వరకు.. ఉదయం 7.15 గంటల నుంచి 8.15 వరకు.. రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు స్టడీ అవర్స్ జరుగుతున్నాయి. పాఠశాల సమయంలో ప్రత్యేక తరగతులు, స్పెషల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమ, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల్లో కూడా ఇలాగే తరగతులు నిర్వహణ జరుగుతోంది. విద్యార్థులకు టాలెంట్ పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు వారి నైపుణ్యాన్ని అంచనా వేస్తున్నారు. ఏ గ్రేడ్ విద్యార్థులకు పాఠ్యాంశాలను రివిజన్ చేస్తుండగా.. డి గ్రేడ్ విద్యార్థులను ఆయా సబ్జెక్ట్ టీచర్లకు దత్తత ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు.



సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మెరుగైన ఫలితాలు సాధిస్తాం..



గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. మండల స్థాయిలో ఎంఈఓల పర్యవేక్షణలో వంద రోజుల ప్రణాళికలు కొనసాగిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. త్వరలో జరగనున్న ప్రీ ఫైనల్ పబ్లిక్ పరీక్షల మాదిరిగా నిర్వహించనున్నాం.

– ఎస్.తిరుపతినాయుడు, డీఈఓ

చదివిస్తున్నాం..



విద్యార్థులను కష్టపడి చదివిస్తున్నాం. మా పాఠశాలలో గత సంవత్సరం శతశాతం ఫలితాలు సాధించాం. ఈ సంవత్సరం కూడా ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాం. అవే ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులకు దత్తత ఇచ్చాం. తెలివైన విద్యార్థులతో కొద్దిమంది చదువులోవెనుకబడిన విద్యార్థులతో మమేకం చేసి చదివిస్తున్నాం.

–టి.చంద్రరావు, హెచ్ఎం, గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల, సీతంపేట

అధిక మార్కుల కోసం శ్రమిస్తున్నాం..



అధిక మార్కుల కోసం శ్రమిస్తున్నాం. ఇప్పటికే సిలబస్‌లు పూర్తయి.. రివిజన్ కూడా చేశారు. మా కోసం టీచర్లు అదనపు సమయం కేటాయిస్తున్నారు. మాలో పోటీతత్వాన్ని నింపుతూ బోధిస్తున్న తీరు చాలా బాగుంది. ప్రత్యేక తరగతుల ద్వారా పాఠ్యాంశాలను ఎక్కువగా రివిజన్ చేసుకునే అవకాశం దక్కింది.

– సవర సుధారాణి, టెన్త్, బాలికల ఆశ్రమపాఠశాల, సీతంపేట

ఏసుమార్గం అనుసరణీయం..



ఉజ్జీవ సభల వద్ద పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

సీతంపేట: ఏసుమార్గం అనుసరణీయమని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని అక్కన్నగూడలో జరుగుతున్న క్రైస్తవ ఉజ్జీవ మహాసభలకు శుక్రవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. ప్రేమ, కరుణ, శాంతి, రక్షణకు ప్రతిరూపం ఏసుక్రీస్తు అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మల్టీపర్పస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని టీడబ్ల్యూ ఈఎన్‌సీ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన కురుపాం మండలం గొటివాడ పంచాయతీ భోరి గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. సాకిగూడ, కోసింగూడ, కొత్తగూడ, డెప్పిగూడలకు మంజూరైన భవన నిర్మాణ పనులను కూడా ప్రారంభించాలని సూచించారు. అనంతరం కురుపాం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈయన వెంట ఈఈ మణిరాజు, డీఈఈ చాణక్య, ఇంజినీరింగ్ సిబ్బంది దుర్గా, రవికుమార్ తదితరులున్నారు.



భోరిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పనులు పరిశీలిస్తున్న టీడబ్ల్యూ ఈఎన్‌సీ శ్రీనివాస్

ప్రభుత్వం దృష్టికి వేతనదారుల సమస్యలు

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకంలోని వేతనదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అల్లు లావణ్యకుమార్ అన్నారు. మండలంలోని రావుపల్లి, సంతోషపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన రహదారులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనదారులు ఉపాధిహామీ పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు విడుదల చేస్తుందని చెప్పారు. పరిశీలనలో ఉపాధిహామీ పథకం సిబ్బంది, వేతనదారులు ఉన్నారు.

సందర్శన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు, దొరజమ్ము, రేగిడి, గొరడ గ్రామాల్లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను పార్వతీపురం ఐటీడీఏ డీడీ ఆర్.కృష్ణవేణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు, అందిస్తున్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. అలాగే మరుగుదొడ్లు, భోజన శాలలు, స్టాక్ రూమ్‌లతో పాటు రికార్డులను కూడా పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సూచించారు.

సంపద సృష్టించాలి..

గరుగుబిల్లి: సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) నుంచి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి పంచాయతీలు ఆర్థికంగా బలపడాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉద్దవోలు పంచాయతీలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. పరిశీలనలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: మల్లి ప్రతిభా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన పీవీటీజీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీల్లో 40 చొప్పున సీట్లు ఉన్నాయని తెలిపారు. వచ్చేనెల 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని.. అదే నెల 9న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

వ్యక్తి అరెస్ట్

సీతంపేట: మండలంలోని అక్కన్నగూడలో 20 లీటర్ల సారాతో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వై. అమ్మన్నరావు శుక్రవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజలకు మెరుగైన సేవలు

- ఎంపీడీఓ రంగారావు

పాలకొండ రూరల్: గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ వీవీ.రంగారావు అన్నారు. మండలంలోని వెలగవాడ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికలపై పలు సూచనలు చేశారు. అనంతరం అంపిలి పంచాయతీ పరిధిలో ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న సాగునీటి చానల్ అభివృద్ధి పనులను పరిశీలించారు. వేతనదారులకు అందించిన మస్తర్లు, రికార్డులతో సరిపోల్చారు. ఉపాధి సిబ్బంది పనులు చేపడుతున్న చోట కచ్చితంగా ఉండాలన్నారు.



వెలగవాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగారావు

ప్రకృతి సంపద కొల్లగొడుతున్నారు..

- కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఏజెన్సీ ప్రాంతాల్లోని విలువైన ప్రకృతి సంపద కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాలలో విదేశీ బహుళజాతి సంస్థలు పాగా వేసేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. పరిశ్రమల స్థాపన – అభివృద్ధి, ఉపాధి కల్పన వంటి పార్టీ నాయకుల వినసొంపైన మాటల వెనుక ఎన్నో కుట్రలున్నాయన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలను నిరసిస్తూ గిరిజన సంఘాల (జేఏసీ) పిలుపు మేరకు ఈనెల 12న చేపట్టబోయే రాష్ట్ర వ్యాప్త ఏజెన్సీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పక్షాన సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.



ఆస్తి పన్ను వసూలు వేగవంతం చేయండి

పాలకొండ: ఆస్తి పన్ను వసూలు వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు ఆస్తి పన్నుతో పాటు కుళాయి పన్నులు వసూలు చేయాలని తెలిపారు. సచివాలయాల సిబ్బంది వార్డుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. మార్చి 30 నాటికి శతశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు.



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

నిర్ణీత వ్యవధిలోగా రెవెన్యూ సేవలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జియ్యమ్మవలస: ప్రజలకు అవసరమైన రెవెన్యూ సంబంధిత సేవలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత వ్యవధిలోగా అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మ్యుటేషన్ల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పనితీరు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తుగా గ్రామాల్లో తాగునీటి బోరుబావుల పనితీరు పరిశీలించాలని.. జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న ఇంటింటికి తాగునీటి కుళాయిల పనులను వేగవంతం చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని శిఖబడి నుంచి లోతువానివలస వలస వరకు సుమారు ఒక కోటీ 40 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయాల్సిన రోడ్డు పనులు మొదలుపెట్టకపోవడంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి పకీరు, ఎంపీడీఓ ఎస్. రమేష్, పంచాయతీ రాజ్ జేఈ ఎం. పార్థసారథి, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మా నోట్లో మట్టి కొట్టొద్దు..

- ఇటుకల తయారీకి మట్టి తీసుకెళ్తే ట్యాక్స్ కట్టాలా..?
- కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడ్డ ఇటుక తయారీ కార్మికులు



వీరఘట్టం మండలంలో సమావేశమైన ఇటుకల తయారీ కార్మికులు

వీరఘట్టం: మట్టిని నమ్ముకుని బతుకుతున్నామే తప్ప... ఆ మట్టిని అమ్ముకుని బతకడం లేదని ఇటుకల తయారీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుకల తయారీకి కావాల్సిన మట్టిని తెలిసిన రైతు పొలాల్లో తవ్వుకుని తీసుకెళ్తుంటే మైనింగ్ అధికారులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు మండలంలోని చిట్టిపులివలస మామిడితోటలో ఇటుక తయారీ కార్మికులు శుక్రవారం సమావేశమయ్యారు. 1076 జీఓ ప్రకారం ఇటుకల తయారీకి తీసుకెళ్లే మట్టికి ఎటువంటి పన్ను చెల్లించనవసరం లేదని పలువురు తెలిపారు. తాము ఇటుకలు తయారు చేయడం వల్ల మరో 25 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నామని, అటువంటి తమపై మైనింగ్ అధికారులు దాడులు చేపట్టి పన్ను పేరిట వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలం నుంచి ట్రాక్టర్ మట్టి తీసుకురావడానికి 700 రూపాయలు ఖర్చవుతుంటే.. మైనింగ్ అధికారులు 310 రూపాయల చాలానా కట్టమనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి మట్టిపై పన్నును రద్దు చేయాలని కోరారు.

ఇదీ పరిస్థితి....

జిల్లాలోని 15 మండలాల్లో సుమారు 300 ఇటుక బట్టీలున్నాయి. ఒక్కో బట్టీలో సుమారు 20 కుటుంబాలు పనిచేస్తున్నాయి. ప్రతి ఏటా వేసవిలో ఖాళీగా ఉన్న పొలాల్లో మట్టిని తవ్వి ఇటుకల తయారీ కోసం తరలిస్తుంటారు. మట్టి తీసుకువెళ్తున్నందుకు రైతుకు డబ్బులివ్వకపోయినా, రవాణా చార్జీల కిందట 700 రూపాయల వరకు ఖర్చవుతుంటుంది. అయితే ప్రతి ట్రాక్టర్‌కు 310 రూపాయల చలానా కట్టాలని మైనింగ్ అధికారులు ఒత్తిడి చేస్తుండడంపై తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

50 కుటుంబాలు బతుకుతున్నాం..



మా ఊరులో 50 కుటుంబాలకు చెందిన వారంతా 80 ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నాం. మాతో పాటు మరో 200 మంది కూలీలు ఇటుకల తయారీకి వస్తున్నారు. మేమంతా ఇటుకల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఇటుకల తయారీకి కావాల్సిన మట్టి ట్రాక్టర్‌కు పన్ను కట్టమంటున్నారు. ఇలాగైతే మాకు ఇటుకల తయారీ గిట్టుబాటు కాదు. మట్టిని నమ్ముకుని బతుకుతున్న మాపై ట్యాక్స్‌లు వేయడం సరికాదు.

– టి.శ్రీనివాసరావు, సీతానగరం

గిట్టుబాటు కావడం లేదు..



ఇటుకల తయారీకి మట్టి, ఊక, కర్రలు, చేత కూలి ఇలా అన్నిటికీ చేసిన ఖర్చుతో ఒక ఇటుక తయారీకి రూ.4.75 ఖర్చు అవుతోంది. మేము ఒక ఇటుకను ఐదు రూపాయలకు అమ్ముతున్నాం. గృహ నిర్మాణాలు పెద్దగా లేకపోవడంతో ఇటుకలకు డిమాండ్ తగ్గింది. అందుచే పావలా లాభానికి అమ్ముతున్నాం. ఇప్పుడు ప్రభుత్వం మట్టి ట్రాక్టర్‌కు రూ.310 చాలానా కట్టమంటోంది. ఇలా కడితే లాభాలు మాట దేవుడెరుగు.. మా కష్టానికి ప్రతిఫలం కూడా రాదు. ఈ విషయంలో ప్రభుత్వం మాకు సహరించాలి.

– ఉరిటి యాదవ్,సుంకి,గరుగుబిల్లి మండలం

హెల్మెట్‌ధారణ తప్పనిసరి..



ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్సై సంజీవ్ సూచించారు. స్థానిక అడ్వంచర్ పార్క్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు రహదారి నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాలతో బయటపడవచ్చాన్నారు. – సీతంపేట

ఉత్తమ ఫలితాలు సాధించాలి..



పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పీఎంఆర్‌సీ ఏఎంఓ పి.కోటిబాబు అన్నారు. మండలంలోని సామరెల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ.. చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆయనతో పాటు హెచ్ఎం ఆరిక భాస్కరరావు ఉన్నారు. – సీతంపేట

ప్రమాదరహిత ప్రయాణమే లక్ష్యం..



ప్రమాదరహిత ప్రయాణమే లక్ష్యంగా ఆర్టీసీ డ్రైవర్లు వ్యవహరించాలని ఏఎంవీఐ నవీన్‌కుమార్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..మితిమీరిన వేగం తగదన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడికి లోనుకాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎం పి.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు బీకే మూర్తి, డ్రైవర్లు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్